సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



గరుడ విహారీ గోవిందా

తిరుమల : తిరుమలలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడ సేవ వైభవంగా సాగింది. శ్రీవారు గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహించారు.



కిక్కిరిసిన తుంబుర తీర్థం

తిరుమల: ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని తుంబురు తీర్థ ముక్కోటి గురువారం వేడుకగా జరిగింది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	36	22
తిరుపతి	37	23
తిరుమల	32	18
గూడూరు	37	24
నగరి	37	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం(సా)	సహర్ శనివారం(ఉ)
తిరుపతి	6.28	4.44
చిత్తూరు	6.30	4.44
పుంగనూరు	6.32	4.48

న్యూస్‌రీల్

చిత్తూరు కలెక్టర్‌గా సగిలి షన్‌మోహన్



సగిలి షన్‌మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా ఏపీ ఎస్‌సీఎల్ సీఈఓ, పీఎస్ డబ్ల్యూఎస్ ఎండీగా పని చేస్తున్న సగిలి షన్‌మోహన్(2013 ఐఏఎస్ బ్యాచ్)ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇక్కడ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మురుగన్ హరినారాయణన్‌ను నెల్లూరు జిల్లాకు బదిలీ చేసింది. అలాగే చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్‌ను ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా బదిలీ చేసింది. చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా పి.శ్రీనివాసులును నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అదేవిధంగా తిరుపతి జిల్లా ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ సీఈవోగా పనిచేస్తున్న గౌతమిని అనంతపురం జిల్లా కలెక్టర్‌గా, తిరుపతి నగరపాలక కమిషనర్ అనుపమ అంజలిని జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో ఆదేశించింది.

ప్రజలకు మెరుగైన సేవలు



బాధ్యతలు స్వీకరించిన డీటీసీ నిరంజన్‌రెడ్డి

చిత్తూరు రూరల్: ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తామని డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. డీటీసీగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీఎల్, ఎల్ఎల్ఆర్‌లో ఎలాంటి సాంకేతిక లోపాలు తలెత్తినా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. డీఎల్ ప్రక్రియ ఆటోమెటిక్ ట్రాక్‌తో పారదర్శకంగా జరుగుతోందన్నారు. చెక్‌పోస్టుల్లో పూర్తి స్థాయిలో నిఘా పెడతామన్నారు. శాఖపరంగా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకోరావచ్చని పేర్కొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

సదుం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ గురువారం తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ, విద్యార్థుల హాజరు పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్, పోలీసు అధికారులకు సూచనలు ఇచ్చారు. తహసీల్దారు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రంలో వసతుల పరిశీలన



పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్, డీఈఓ

వడమాలపేట : వడమాలపేట పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని గురువారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తనిఖీ చేశారు. బయట వ్యక్తులను కేంద్రంలోకి అనుమతించకూడదని చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లను ఆదేశించారు. తాగునీరు, ప్రథమ చికిత్స మందులు, ఓఆర్ఎస్ సాచెట్స్ అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. నాడు-నేడు పనులను పరిశీలించారు. డీఈఓ శేఖర్ పాల్గొన్నారు.

నైపుణ్యమస్తు.. ఉద్యోగప్రాప్తిరస్తు!



చిత్తూరులో 'రోగి సంబంధాల సేవ' కోర్సు చేస్తున్న విద్యార్థులు

'నిరుద్యోగం అనే మాట వినిపించకూడదు. పేదరికంతో ఏ ఒక్కరి చదువూ ఆగిపోకూడదు. చదువే మనం పిల్లలకు ఇచ్చే ఆస్తి. భవిష్యత్‌లో వారు కలెక్టరుగానో.. ఇంజినీరుగానో స్థిరపడితే ఆ ఇల్లు.. ఊరు.. జిల్లా.. రాష్ట్రం బాగుపడుతుంది. దానికోసం ఎంతైనా ఖర్చుచేస్తా..'నంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. ఆ మేరకు ఇప్పటికే పాఠశాలల రూపురేఖలు మార్చారు. ఇప్పుడు నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సంకల్పించారు. ఇందులో భాగంగానే ప్రతి నియోజకవర్గంలో స్కిల్‌హబ్ సెంటర్లు నిర్వహిస్తూ వారి ఉద్యోగావకాశాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రతి నియోజకవర్గంలో స్కిల్‌హబ్ సెంటర్
- ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 6,523 మందికి శిక్షణ
- హర్షం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

పుత్తూరు రూరల్: యువతకు ఉద్యోగాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో చిత్తూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు అందుబాటులోకి తెచ్చింది. పదో తరగతి పాస్/ఫెయిల్ కనీస విద్యార్హత కలిగిన యువతీయువకులకు మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇప్పిస్తోంది. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించడంతోపాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తోంది. ఇప్పటికే చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 3,023 మంది శిక్షణ ఇవ్వగా.. అదులో జాబ్ మేళాల ద్వారా 1,650 మంది ఉద్యోగాలు పొందారు. తిరుపతి జిల్లాలో 3,500 మందికి శిక్షణ ఇవ్వగా, 1,850 మందికి ఉద్యోగాలు లభించాయి. ప్రస్తుతం ఈ స్కిల్ హబ్ సెంటర్లు ఆయా నియోజకవర్గాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణకు ఒక్కో సెంటర్‌కు ఒక ఇన్‌చార్జి, కో-ఆర్డినేటర్, కోర్సుల మేరకు ట్రైనీలు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో కోర్సుకు సంబంధించి ఒక్కో గ్రూపునకు 30 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు.

చిత్తూరు జిల్లాలో అందుబాటులో ఉన్న కోర్సులు

నియోజకవర్గం	కోర్సులు	కోఆర్డినేటర్	సెల్ నెంబర్
నగరి (పుత్తూరు)	డేటా ఎంట్రీ ఆపరేటర్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్	రసూల్	63009 54441
గంగాధరనెల్లూరు (కార్వేటినగరం)	మీడియా కంటెంట్ డెవలపర్, డేటా ఎంట్రీ ఆపరేటర్	అబ్దుల్	81425 09017
పూతలపట్టు	అసోసియేట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ ప్లంబర్.	ఫిరోజ్	63019 33565
కుప్పం	బ్యూటీ థెరపిస్టు, డేటా ఎంట్రీ	రాజా	90525 07933
పలమనేరు	ట్రైనీ బ్యూటీషన్, డేటా ఎంట్రీ	సిసింద్రీ	84658 30771
పుంగనూరు	స్యూయింగ్ మెషిన్ ఆపరేటర్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, అసిస్టెంట్ సర్వేయర్, అసోసియేట్ ఎలక్ట్రీషియన్.	సుబ్రమణ్యం	77805 99208
చిత్తూరు	అసిస్టెంట్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్, యూపీఎస్ సర్వీస్, ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్, అసోసియేట్ డేటా ఎంట్రీ	చైతన్య	81219 84014

తిరుపతి జిల్లాలో అందుబాటులో ఉన్న కోర్సులు

నియోజకవర్గం	కోర్సులు	కాంటాక్ట్ నెంబర్
చంద్రగిరి	4 వీలర్ సర్వీసెస్ టెక్నీషియన్, 2 వీలర్ సర్వీసెస్ టెక్నీషియన్ ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్	90593 97752
తిరుపతి	అసిస్టెంట్ ప్లంబర్, సర్వేయర్ ఎయిడ్ అసోసియేటివ్ ఎలక్ట్రీషియన్	97004 13939
గూడూరు	అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసోసియేటివ్ ఎలక్ట్రీషియన్, ట్రైనీ బ్యూటీషియన్	86398 08782
వెంకటగిరి	ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్, సీఎన్‌సీ ఆపరేటర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ	98664 20415
సూళ్లూరుపేట	ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఫిట్టర్ మెకానికల్ అసెంబ్లీ, మోటార్ ఆర్క్ వెల్డింగ్	86399 15833
సత్యవేడు	సర్వీస్ టెక్నీషియన్, హోమ్ అప్లియన్స్, అసెంబ్లీ ఆపరేటర్-ఆర్ఏసీ, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్	91670 13413
శ్రీకాళహస్తి	కలంకారీ ఆర్టిస్ట్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ట్రైనీ బ్యూటీషన్ టైలరింగ్	79895 09540

చిత్తూరులో స్కిల్ కాలేజీ

ప్రభుత్వం ప్రతిజిల్లా కేంద్రంలో ఒక స్కిల్ కాలేజీని ఏర్పాటు చేసింది. చిత్తూరు స్కిల్ కాలేజీలో 'రోగి సంబంధాల సేవా విధి నిర్వాహకులు' కోర్సును నిర్వహిస్తున్నారు. ఈ కోర్సును అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా.. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత అయిన యువతీయువకులు అర్హులు. 6 నెలల ఉచిత శిక్షణా కాలంలో భోజనం, వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. కోర్సు పూర్తయిన వారికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తారు.

యువత భవిష్యత్‌కు చక్కటి పునాది



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్కిల్ హబ్ సెంటర్లు నేటి యువత భవిష్యత్‌కు చక్కటి పునాది. చదువుకుంటున్నా, చదువును మధ్యలో ఆపేసిన యువతీయువకులకు ఉద్యోగాలను అందించే కల్పతరువు. తిరుపతిలో స్కిల్ యూనివర్సిటీ, విశాఖపట్నంలో హైఎన్డ్ స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు కానున్నాయి.

– ఎం.గుణశేఖర్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, చిత్తూరు

ఫ్యాషన్ డిజైనర్‌గా రాణిస్తా



నేను డిగ్రీ పూర్తి చేశా. వలంటీర్ చొరవతో ఫ్యాషన్ డిజైనర్‌గా శిక్షణ పొందుతున్నా. ఫిల్స్‌కట్, అంబ్రెళ్ల వంటి పలు రకాల శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ ఇస్తున్న శిక్షణ విధానం మరెక్కడా లేదు. ఫ్యాషన్ డిజైనర్‌గా స్థిరపడాలనుకుంటున్నా.

– శిల్ప, విద్యార్థి, ఫ్యాషన్ డిజైనర్, పుంగనూరు

చదువు మానేసిన వారికి వరం



చదువు మానేసి ఉద్యోగం లేని వారికి స్కిల్ హబ్ సెంటర్లు ఓ వరం. ఉచిత శిక్షణతో పాటు వారి ప్రాంతాల్లోనే ఉపాధిని పొందవచ్చు. డిగ్రీ చదువుతూ కూడా స్కిల్ కోర్సులను అభ్యసించవచ్చు. ప్రస్తుతం పుత్తూరులో 'అకౌంట్స్ ఎక్సిక్యూటివ్స్' కోర్సులో శిక్షణ ఇస్తున్నాం. డేటా ఎంట్రీ ఆపరేటర్, టైలరింగ్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.

– టీ.నరసింహులు, స్కిల్ హబ్ సెంటర్ ఇన్‌చార్జి, పుత్తూరు

ఉద్యోగం వస్తుందనే నమ్మకం కలిగింది



రెండు నెలలుగా అకౌంట్స్ ఎక్సిక్యూటివ్‌గా శిక్షణ పొందుతున్నా. మంచి అనుభవం ఉన్న వారు ట్రైనింగ్ ఇస్తున్నారు. ఇలా స్కిల్ సెంటర్లలో శిక్షణ పొంది ఉద్యోగం సంపాదించిన వారి సూచన మేరకే నేను ఇందులో జాయిన్ అయ్యాను. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. మంచి ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో ఉన్నాను.

– నవీన్‌బాబు, విద్యార్థి, అకౌంట్స్ ఎక్జిక్యూటివ్, పైడిపల్లి గ్రామం, పుత్తూరు మండలం

సంక్షేమానికి చిరునామా జగన్



రొంపిచెర్లలో ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సభకు హాజరైన లబ్ధిదారులు

- హామీలన్నీ అమలు చేసిన ఏకైక సీఎం
- ఆర్థిక ఇబ్బందుల్లోనూ సంక్షేమ పథకాలు
- ఇలాంటి సీఎంను ఎన్నడూ చూడలేదు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: ఎన్నికల హామీలను 98.44 శాతం అమలు చేసిన ముఖ్యమంత్రిని తాను ఇంతవరకు చూడలేదని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్లలో గురువారం ఆసరా చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ తాను పీజీ పూర్తిచేసిన వెంటనే 1978 వ సంవత్సరంలో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. అప్పటినుంచి గమనిస్తున్నానని.. మేనిఫెస్టోను భగవద్గీతలాగా భావించి తు.చ. తప్పకుండా అమలు చేస్తున్న ముఖ్యమంత్రిని కేవలం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే మాత్రమే చూశానని ప్రశంసించారు. కరోనాతో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సమయంలో కూడా కోవిడ్ నియంత్రణ చర్యలు పాటిస్తూ.. మరోవైపు కరోనా బారినపడ్డ వారిని కాపాడుకుంటూ వచ్చారని తెలిపారు. అటువంటి సమయంలో కూడా సంక్షేమ పథకాలను అమలుచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఇలాంటి సీఎంను తాను ఎన్నడూ చూడలేదని తెలియజేశారు.

10 శాతం కూడా హామీలు అమలుచేయని చంద్రబాబు

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 600 హామీలు ఇచ్చి తన ప్రభుత్వ హయాంలో కనీసం 10 శాతం కూడా అమలు చేయలేదని మంత్రి పెద్దిరెడ్డి విమర్శించారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి కూడా ఏమీ చేయలేదని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబును జిల్లాకు రాకుండా ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఏపీకి రాకుండా చంద్రబాబును తరిమి కొడతారని విమర్శించారు.

అభివృద్ధిలో ఆదర్శం

పుంగనూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తయారు చేశామని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. రొంపిచెర్ల మండలంలో ప్రతి గ్రామానికి రోడ్లు, తాగునీటి ట్యాంక్‌లు, కాలువ పనులు చేశామని అన్నారు. అనంతరం రొంపిచెర్లలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్, సీఈవో ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దేవులపల్లె హరినాథరెడ్డి, ఎంపీడీవో రాజేంద్ర, ఏసీఎం బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆడపడుచుల అండ జగనన్న



మాట్లాడుతున్న రమాదేవి

సదుం: ఆడపడుచుల కష్టం తీర్చే అన్న లాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని, తండ్రి లాగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నారని ఆసరా లబ్ధిదారు రమాదేవి కొనియాడారు. సదుంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ.. ''మహిళల కష్టాలు తీర్చేలా వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, పింఛన్ వంటి పథకాలు అమలు చేస్తున్న సీఎంకు జన్మజన్మలా రుణ పడి ఉంటాం. ఈపథకాల ద్వారా పొందే లబ్ధితో కుటుంబాలు అభివృద్ధి చెందుతున్నాయి'' అని సంతోషం వ్యక్తం చేశారు.

మళ్లీ వైరస్.. అప్రమత్తతే కీలకం

- జిల్లాలో నాలుగు కోవిడ్ పాజిటివ్ కేసులు
- రోజుకు 50 మందికి పరీక్షలు చేసేలా చర్యలు
- ఇప్పటి వరకు 2,345 ర్యాపిడ్ టెస్టులు
- నిబంధనలు పాటించాలంటున్న వైద్య నిపుణులు



చిత్తూరు రూరల్: జిల్లాలో మళ్లీ కోవిడ్ కేసులు మొదలయ్యాయి. ఈనేపథ్యంలో రోజుకు 50 ర్యాపిడ్ పరీక్షలు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. పది రోజుల వ్యవధిలో నాలుగు కేసులు నిర్ధారణ అయ్యాయి. దీంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం పరీక్షల సంఖ్యను పెంచుతూ కోవిడ్ వ్యాప్తికి అడ్డుకట్ట వేసే పనిలో పడింది. కోవిడ్ వ్యాప్తితో భయం వద్దని, నిబంధనలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాలో రామకుప్పం, తదితర ప్రాంతాల్లో కోవిడ్ కేసులు బయటపడ్డాయి. పది రోజుల వ్యవధిలో నలుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మరో 50 మందికి పరీక్షలు చేసి ల్యాబ్‌కు పంపించారు. ఇందులో కూడా మరిన్ని కేసులు తేలొచ్చన్ని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు ప్రధానం కారణం..మాస్క్, శానిటైజర్, సామాజిక దూరాన్ని ప్రజలు విస్మరించడమేనని వైద్యులు చెబుతున్నారు. సెలవుల సమయం, వరుస ప్రయాణాలు, రాష్ట్రాలు, దేశాల హద్దులు దాటి ప్రయాణించడం, ఆయా ప్రాంతాల నుంచి స్వస్థలాలకు తిరిగి రావడం కోవిడ్ కేసులు పెరగడానికి కారణమని అంటున్నారు. తాజాగా గుర్తించిన కోవిడ్ కేసుల అసాధారణ లక్షణాల కారణంగా శ్యాంపిళ్లను హోల్ జీనోమిక్ సీక్వెన్సింగ్‌కు పంపించారు. నివేదికల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. రానున్న నివేదికల ఆధారంగా కోవిడ్ వైరస్ వేరియంట్‌ను నిర్ధారించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ముందు జాగ్రత్త

ముందస్తు చర్యల్లో భాగంగా కోవిడ్ పరీక్షల సంఖ్యను పెంచాలంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. రోజుకు కనీసం 50 పరీక్షలు చేయాలని ఆదేశించింది. ఇలా ఇప్పటి వరకు 2,345 మందికి కోవిడ్ పరీక్షలు చేశారు. జిల్లాలో పీహెచ్‌సీలు 50, సీహెచ్‌సీలు 8, ఏరియా ఆస్పత్రులు 4, అర్బన్‌హెల్త్ సెంటర్లు 14 ఉండగా..అన్నింటిలోను పరీక్షలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రస్తుతం రోజుకు 20 నుంచి 50 మధ్య జిల్లాలో కోవిడ్ పరీక్షలు చేస్తున్నారు.

ఆస్పత్రుల్లో కోవిడ్ బెడ్లు..

కోవిడ్ రోగుల చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక వార్డును అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏరియా ఆస్పత్రుల్లో కూడా ఏర్పాట్లు చేసేలా చర్యలు చేపట్టారు. ఏర్పాట్ల వివరాలను సేకరించి జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు. అలాగే ఆక్సిజన్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ప్రజల అప్రమత్తతోనే కట్టడి సాధ్యమని సూచిస్తున్నారు.

రమణీయం..రాళ్లగంగమాంబ రథోత్సవం



పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న ఎమ్మెల్సీ భరత్



హెలికాప్టర్ నుంచి రథంపైకి పూలవర్షం

గుడుపల్లె: మండలంలోని కుప్పిగాని పల్లెలో శ్రీప్రసన్న రాళ్లగంగమాంబ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ పట్టు వస్త్రాలను సమర్పించారు. తదుపరి అమ్మవారి ఉత్సవర్లను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, వివిధ అభరణాలతో అలంకరించి రథంపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయం చుట్టూ భక్తుల గోవింద నామస్మరణల నడుమ రథోత్సవం నేత్రపర్వంగా సాగింది.

హెలికాప్టర్ నుంచి పూల వర్షం

కర్ణాటక రాష్ట్రం దొనిమడుగు పంచాయతీ చైర్మన్ మంజులమహదేవన్ అమ్మవారి ఆలయం, రథంపై హెలికాప్టర్ నుంచి పూల వర్షం కురిపించారు. ఏటా బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా పూల వర్షం కురిపించి మొక్కు తీర్చుకోవడం ఆనవాయితీ అని మంజులా మహదేవన్ తెలిపారు. పూల వర్షాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. రథం లాగి తన్మయులయ్యారు.

క్లుప్తంగా

చిత్తూరు డీఆర్‌డీఏకు స్కొచ్ అవార్డులు



డీఆర్‌డీఏ పీడీ తులసి, అధికారులను అభినందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

తిరుపతి రూరల్: చిత్తూరు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ పథకాలకు ప్రతిష్టాత్మకమైన రెండు స్కొచ్ సిల్వర్ అవార్డులు రావడం సంతోషమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం తిరుపతిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో చిత్తూరు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు వరించిన రెండు స్కొచ్ అవార్డులతో డీఆర్‌డీఏ పీడీ తులసి, అధికారులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి అభినందించారు.

జనం గుండెల్లో ఉంటేనే నాయకుడు



సమస్యలు తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ''ఒక ప్రజా ప్రతినిధిగా ప్రజలు పూల దండలు వేసినా వేసుకోవడానికి సిద్ధంగా ఉండాలి.. అదే ప్రజలు సమస్యల దండవేసినా వేసుకోవడానికి సిద్ధంగా ఉండాలి'' అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. కార్వేటినగరంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ప్రజలు ఆనందంతో పూలమాలలు వేసినా వేసుకోవాలని, అదే ప్రజలు ఈర్ష్య, ద్వేషంతో సమస్యల దండ వేసినా సంతోషంగా వేసుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అన్ని సంక్షేమాలు ప్రభుత్వం అందిస్తున్నా, పేదలు బాగుపడడం జీర్ణించుకోలేక తెలుగుదేశం, జనసేన పార్టీలు విమర్శలకు దిగుతున్నాయన్నారు. 98 శాతం మంది పూలమాలలతో సత్కరిస్తూ, పూల వర్షం కురిపిస్తుంటే ఆ రెండు పార్టీలు మాత్రం ఈర్ష్య, పగతో విమర్శలకు దిగడం దారుణంగా ఉందని నారాయణస్వామి విమర్శించారు.

జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రారంభం

- గత ఏడాది ట్రయల్ రన్‌గా..
- విజయవంతంగా సాగిన ప్రయోగం
- అధికారికంగా ప్రారంభమైన కుటుంబ వైద్యం
- పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

చిత్తూరు రూరల్: పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం గురువారం అధికారికంగా ప్రారంభమైంది. గతేడాది అక్టోబర్ 21 వ తేదీన ప్రయోగాత్మకంగా సేవలను ప్రారంభించారు. ఈ సేవలు క్షేత్రస్థాయిల్లో విజయవంతమైంది. ఈనేపథ్యంలో సేవలను విస్తృతం చేసేందుకు గురువారం జిల్లా వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు, అధికారుల చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభమైంది.

- రొంపిచెర్ల మండలంలో అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్ ఫ్యామిలీ ఫిజిషియన్‌ను ప్రారంభించారు. సేవల అమలుతీరును పరిశీలించారు. ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.
- కుప్పం మండలం మల్లనూరులో ఎమ్మెల్సీ భరత్ ఫ్యామిలీ ఫిజిషయన్‌ను ప్రారంభించారు.
- చిత్తూరు రూరల్ మండలం చింతలగుంటలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 104 వాహనానికి పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- పూతలపట్టు మండలం చిటిపిరాళ్ల పంచాయతీలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.
- పలమనేరు మండలం కరిడి మెడుగులో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు ప్రారంభించారు.
- నగరి మండలం ఉంద్రాజు కుప్పంలో డీఐఓ రవిరాజు, ఎస్పురం మండలం పిళ్లారి కుప్పంలో జిల్లా ఆరోగ్య పోగ్రాం అధికారి శ్రీనివాసరావు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించి ప్రజలకు సేవలను అందించారు.

సేవలు ఇలా...

జిల్లాలో 464 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ఈ క్లినిక్‌ల పరిధిలో డాక్టర్లు 110 మంది, అదనంగా మరో ముగ్గురు డాక్టర్లు, పారా మెడికల్ స్టాఫ్ 2058 మంది, 104 వాహనాలు 41 ఉన్నాయి. ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నెలలో ఒకటికి రెండు సార్లు ఫ్యామిలీ ఫిజిషియన్‌ను నిర్వహిస్తారు. ఈక్లినిక్ ద్వారా14 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. 105 రకాల మందులను అందుబాటులో ఉంచారు. మధ్యాహ్నం వరకు క్లినిక్‌కు వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తారు. ఆరోగ్య పరిస్థితి బట్టి ఉచితంగా మందులు, మాత్రలు ఇస్తుంటారు. అనంతరం లేవలేని స్థితిలో ఉన్న రోగులు, ఆపరేషన్ చేయించుకున్న వారి ఇంటింటికి వెళ్లి వైద్య సూచనలు ఇస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తారు.

ఇంటి వద్దకే మెరుగైన వైద్యం



ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి



బీపీ చెక్ చేసుకుంటున్న డిప్యూటీ సీఎం

- ఆస్పత్రులకు పరుగులు అవసరం లేదు
- ఫ్యామిలీ డాక్టర్‌లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పుత్తూరు రూరల్: ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తీసుకు వచ్చారని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి తెలిపారు. గురువారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం, లింగంగుంట్ల గ్రామం నుంచి సీఎం ప్రారంభించిన కార్యక్రమాన్ని పుత్తూరు మండలం తడుకు గ్రామం వద్ద ప్రత్యక్ష ప్రసారం ద్వారా డీప్యూటీ సీఎం నారాయణస్వామి, కలెక్టర్ వెంకట రమణారెడ్డి, డీఎంహెచ్‌ఓ శ్రీహరి వీక్షించారు. అనంతరం డీప్యూటీ సీఎం నారాయణస్వామి కలెక్టర్‌తో కలిసి జెండా ఊపి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం ఆస్పత్రుల వద్దకు పరుగులు పెట్టే పని లేకుండా ఇంటి వద్దే మెరుగైన వైద్యం పొందే బృహత్తర అవకాశాన్ని సీఎం జగనన్న అందించారని చెప్పారు. ఇప్పటికే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108 వంటి పథకాల కింద మెరుగైన సేవలు అందుతుండగా, నేడు ఇంటి వద్దే వైద్యం పొందే అవకాశం కలగడం పేద ప్రజల అదృష్టమని అభివర్ణించారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో 14 రకాల టెస్టులు, 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఫ్యామిలీ డాక్టర్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు వివరించారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన రోగులకు ఫ్యామిలీ డాక్టర్ పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అనంతరం డిప్యూటీ సీఎం బీపీ పరీక్షలు చేయిం చుకున్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, డీసీహెచ్‌ఎస్ ప్రభావతి, తహసీల్దార్ రోశ య్య, ఎంపీడీఓ ఇందిర, ఎంపీపీ మునివేలు, సర్పంచ్ వెంకటేష్, డాక్టర్లు హనుమంతరావు, చైతన్య, హేమభూషణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరు బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.60,500
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,500
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.73,000
రిటైల్ వెండి గ్రాము రూ.76

రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవనంలో గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కో–ఆపరేటివ్ అధికారి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. జిల్లా చైర్మన్‌గా రమేష్‌బాబు, వైస్ చైర్మన్‌గా గోవర్ధన్‌బాబీ, కోశాధికారిగా తేజోమూర్తి, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనకార్యవర్గ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు.

కులమతాలకు అతీతంగా అభివృద్ధి



పుత్తూరు షాదీమహాల్‌లో ద్వారబంధనం కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. గురువారం పుత్తూరు పట్టణంలో రూ.1.85 కోట్లతో నిర్మిస్తున్న షాదీ మహాల్ భవన్‌లో ద్వారబంధనం ఏర్పాటు కార్యక్రమం మంత్రి రోజా చేతుల మీదుగా జరిగింది. ఆమె మాట్లాడుతూ పుత్తూరులో షాదీమహాల్ నిర్మాణంతో నగరి నియోజకవర్గంలోని ముస్లింల చిరకాల కోరిక నెరవేర నుందని చెప్పారు. నిరుపేద తల్లిదండ్రులకు ఆడపిల్లల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో 'వైఎస్సార్ కల్యాణమస్తు', 'షాదీ తోఫా' పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. మైనారిటీలకు అన్ని రంగాల్లోనూ తగిన ప్రాధాన్యత ఇచ్చిన ఘనత ఒక్క జగనన్నకు మాత్రమే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమపాలల్లో అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ వీఎం మాహీన్, తిరుపతి పార్లమెంటరీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అహ్మద్ అలీ, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, ముస్లిం నాయకులు జాఫర్, నౌషాద్, సలీం, దావూద్, అమీన్, ఈశ్వరాలయం, ద్రౌపదీదేవి, ఆరేటమ్మ ఆలయాల చైర్మన్లు రమేష్‌బాబు, లారీమోహన్, మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం జిల్లా కమిటీ

చిత్తూరు రూరల్: జాతీయ అంబేడ్కర్ సేవా సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షుడు చంద్ర పేర్కొన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా జగన్‌బాబు, అధికారి ప్రతినిధిగా సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, సేవా అధ్యక్షుడిగా మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

తాగు నీటిపై ప్రత్యేక దృష్టి

సాక్షి, చిత్తూరు : వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో తాగు, సాగు నీటికి ఇబ్బందులు కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. విజయవాడ నుంచి గురువారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ పథకాల లక్ష్యాలను నిర్దేశించిన కాల పరిమితిలోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. రీ సర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, వ్యవసాయం, ఉద్యానవనం అనుబంధ రంగాలు, ఉపాధి హామీ పనులు, గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. మొదటి దశలో రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో మే 10వ తేదీ లోపు సరిహద్దు రాళ్లను నాటే ప్రకియను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. వేసవికాలం దృష్ట్యా గ్రామాలు, మండలాలు, పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమారుతి హాస్పిటల్స్ ప్రారంభం





ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి స్వాగతం పలుతున్న డాక్టర్ మారుతీకృష్ణ, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖ నటుడు మోహన్‌బాబు

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మినర్వా గ్రాండ్ హోటల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీమారుతి 100 పడకల హాస్పిటల్స్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సినీ హీరోలు డాక్టర్ మోహన్‌బాబు, మంచు విష్ణు, మంచు మనోజ్, పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మోహన్‌బాబు మాట్లాడుతూ గత 9 ఏళ్లుగా అతి తక్కువ ఖర్చుతో పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న శ్రీమారుతి హాస్పిటల్స్ మరో అడుగు ముందుకువేసి సరికొత్త టెక్నాలజీతో నూనంగా శ్రీమారుతి హాస్పిటల్స్ ను ప్రారంభించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ తిరుపతి, రాయలసీమ ప్రజలకు గుండెకు సంబంధించిన అత్యాధునిక కేథల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావడమేగాక నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో అన్ని విభాగాలను ఒక్కచోట ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ మారుతీకృష్ణ మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీ దృష్టిలో ఉంచుకొని తిరుపతి, రాయలసీమ ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలందజేయాలనే ఉద్దేశంతో నూతనంగా శ్రీ మారుతి హాస్పిటల్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. మేయర్ డాక్టర్ శిరీష, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, బర్డ్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్, ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ దగ్గుపాటి శ్రీహరిరావు, హాస్పిటల్ డైరెక్టర్ ఎం.రామక్రిష్ణమనాయుడు, కడప జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మేనేజర్ దామోదరం, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

చెరువులో ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్ వద్ద గ్రామస్తుల సహాయక చర్యలు



గాయపడిన పురుషోత్తం

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం పాతచెరువు కట్టపై గురువారం మధ్యాహ్నం వరి ధాన్యం లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులో బోల్తా పడింది. ట్రాక్టర్ కింద చిక్కుకుని ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ఆదిఆంధ్రవాడకు చెందిన పురుషోత్తం(55) పొలం నుంచి ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేసి స్వగ్రామానికి చెరువు కట్టపై వస్తున్నాడు. ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులో బోల్తా పడింది. ట్రాక్టర్ ఇంజన్ కింద పురుషోత్తం(55), వెంటే ఉన్న తమ్ముడు కుమారుడు రాహుల్(9) చిక్కుకున్నారు. ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న సర్పంచ్ గాలి మహేష్ బాబు గ్రామస్తులతో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. సహాయక చర్యలు ప్రారంభించారు. నీళ్లు పోసి ఇంజిన్‌లోని మంటలను అదుపు చేశారు. రెండు జేసీబీల సాయంతో ట్రాక్టర్‌ను వెలికితీసి పురుషోత్తం, రాహుల్‌ను రక్షించారు. 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

170 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తడ: తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడిచేసి 170 బస్తాల రేషన్ బియ్యంతోపాటు కొనుగోలు చేస్తున్న అక్రమార్కుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పక్కా సమాచారంతో సీఎస్‌డీటీ ఓబయ్య, విజిలెన్స్‌కి చెందిన అధికారులు విజయ్‌కుమార్, రామకృష్ణనాయక్ సిబ్బందితో కలిసి అక్కంపేటలోని కొనుగోలు కేంద్రంపై దాడిచేశారు. దాడి సమయంలో కొనుగోలు కేంద్రం వద్ద 1.67 లక్షల విలువైన 140 బస్తాల తమిళనాడు బియ్యం, 30 బస్తాలు ఆంధ్రా రేషన్ బియ్యం ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా కొనుగోలు చేస్తున్న వాటంబేడు గ్రామానికి చెందిన హరనాథ్ అలియాస్ సిద్ధయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. బియ్యాన్ని గోదాముకు తరలించి నిందితుడిని తడ పోలీసులకు అప్పగించారు.